క్లుప్తంగా

'దాసరి' కుటుంబానికి పరామర్శ



సీతబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తోట నరసింహం, శ్రీరాంజీ తదితరులు

గోకవరం: ఇటీవల మృతి చెందిన ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి సీతాబాబు కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తోట నరసింహం, పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, మాజీ ఎమ్మెల్యే చిట్టూరి రవీంద్ర పరామర్శించారు. ఈ సందర్భంగా సీతాబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, పాటి రాంబాబు, సుంకర వీరబాబు, సమ్మెటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గణేష్

ఏలేశ్వరం: అధికారులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ కోరారు. పట్టణంలో గురువారం ఆయన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పట్టణంలోని గొల్లలమెట్ట సమీపంలో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో అధికారులు ఆక్రమణలను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండేటి నాగమణి, నాగులాపల్లి శంకర్, గూనాపు సాయి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో తనకు, తన పంటకు నష్టం చేకూర్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత రైతు సత్తి వినోద్ కుమార్‌రెడ్డి చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాధిత రైతు వినోద్ కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన తాను మండలంలోని ఇ.గోకవరంలో పది ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమిని సాగు చేయకుండా కొంత మంది అడ్డుకోవడంతో పాటు తనపై దాడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగే వరకూ దీక్షను కొనసాగిస్తానని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక మహిళా శక్తి భవనంలో కుట్టుమెషీన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కుట్టుమెషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడేందుకు పలు అంశాలపై శిక్షణ తీసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జీ, పసల సూరిబాబు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చిక్కాలక్ష్మణరావు పాల్గొన్నారు.

తునిలో కారు దగ్ధం

తుని: పట్టణ శివారులో గురువారం కారు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే..స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా రోడ్డు పక్కన ఓ కారు నిలిపి ఉంది. దాని చెంతనే ఉన్న చెత్త, వ్యర్థాలకు నిప్పు పెట్టారు. వాటి నుంచి అగ్ని కీలలు చెలరేగి కారుకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో కారు ముందు బాగం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యుడు సందీప్ సూచించారు. మండలంలోని వేళంగిలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు జ్వరం, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పాఠశాల పూర్వ విద్యార్థులు చిక్కం దొరబాబు రూ.5116, దవులూరి బ్రహ్మాజీ నాయుడు రూ.5 వేలు విలువైన క్రీడా సామగ్రి అందజేశారు. క్రీడా పరికరాలను పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజు చేతుల మీదుగా గురువారం పాఠశాల హెచ్ఎం కె.అబ్బులుకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడానికి క్రీడా పరికరాలు అందజేసిన పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లను దమ్ము చేస్తున్నాయ్

- గ్రామాల్లో యథేచ్ఛగా దమ్ముచక్రాలతో ట్రాక్టర్ల రాకపోకలు
- ఛిద్రమవుతున్న రహదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఒమ్మంగిలో దమ్ము చక్రాలతో రహదారిపై వెళుతున్న ట్రాక్టర్



దమ్ము చక్రాలకు ధ్వంసమైన బీటీ రోడ్డు

ప్రత్తిపాడు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. గ్రామాల్లో దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు యథేచ్ఛగా రాకపోకలు సాగించడంతో రోడ్లకు ముప్పు తప్పడం లేదు. నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు ట్రాక్టర్లతో దమ్ము చేయిస్తున్నారు. ట్రాక్టర్ యజమానులు దమ్ము చక్రాలను పొలాల్లోకి తీసుకువెళ్లి అక్కడ ట్రాక్టర్లకు బిగించి దమ్ము చేయాల్సి ఉండగా వారు నిబంధనలు పాటించడం లేదు. ట్రాక్టర్ల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దమ్ముచక్రాలను ఇళ్ల వద్దే ట్రాక్టర్‌కు బిగించి పొలాలకు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి వేయించిన రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. దమ్ముచక్రాల రాకపోకలతో గ్రామాల్లోని అంతర్గత సీసీ రోడ్లు, బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిని రోడ్డుపై కంకర, తారు లేచిపోయి అధ్వానంగా మారుతున్నాయి. ఈ రహదారులపై ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

15,577 ఎకరాల సాగు భూమి

ప్రత్తిపాడు మండలంలో 15,577 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో 10,500 ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో పత్తి, 925 ఎకరాల్లో మినుములు, 105 ఎకరాల్లో పెసలు, 2,547 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేస్తున్నారు.

అవగాహన లేమితో..

గ్రామాల్లో ట్రాక్టర్ల యజమానులు ఇష్టం వచ్చినట్టు దమ్ము చక్రాలతో రోడ్లపై తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ట్రాక్టర్ డ్రైవర్లు, రైతులకు అవగాహన లేకపోవడం, ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయి. దమ్ముచక్రాలు బీటీ రోడ్డుపై వెళితే రహదారి ఇంచు లోపలికి గాడి పడిపోతుంది. దీంతో చిన్నచిన్న గుంతలు ఏర్పడి రోడ్డు ధ్వసంమవుతుంది. దమ్ము ట్రాక్టర్ల ధాటికి ఏలేశ్వరం– శాంతిశ్రమం రహదారి, ఒమ్మంగి–రాచపల్లి రోడ్డు, లంపకలోవ–ప్రత్తిపాడు, శాంతిఆశ్రమం–పోతులూరు, ఉత్తరకంచి – శరభవరం, చిన్నింపేట –చినశంకర్లపూడి రహదారులు ధ్వంసం అవుతున్నాయి. ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు వేసుకుని రోడ్డుపై తిరగకుండా ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులు అవగాహన కల్పించి నిబంధనలు పాటించనివారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుమ్మచక్రాలతో రోడ్లపై తిరిగితే చర్యలు



గ్రామాల్లో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్లు దమ్ముచక్రాల రాకపోకలతో ధ్వంసం అవుతున్నాయి. రోడ్లను ఎవరు పాడుచేసినా నేరమే. ట్రాక్టర్ల యజమానులు తప్పనిసరిగా దమ్ము చక్రాలకు బద్దెలు ఏర్పాటు చేసుకోవాలి. బద్దెలకు తక్కువ ఖర్చు అవుతుంది. వీటిని సులువుగా చక్రాలకు అమర్చుకోవచ్చు. బద్దెలు లేకుండా రోడ్లపై దమ్ము చక్రాలతో తిరిగితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.లక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్, ప్రత్తిపాడు

అవగాహన కల్పించాలి



గ్రామాల్లో రైతులు, ట్రాక్టర్ల యజమానులకు అధికారులు అవగాహన కల్పించాలి. దమ్ము చక్రాలతో బీటీ రహదారులను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. అడిగేవారు లేకపోవడంతో చాలా మంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రహదారులపై దమ్ము చక్రాలతో వెళ్లడంతో రోడ్లు దెబ్బ తింటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జక్కా త్రిమూర్తులు, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

విధులపై మహిళా పోలీసులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

జగ్గంపేట: విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగం, ర్యాగింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. జగ్గంపేట పోలీసు సర్కిల్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట మండలాల మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గంజాయి విక్రయాలు, మత్తు పదార్థాల వినియోగం, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ నివారణకు మహిళా పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బాలికల హాస్టళ్లను సందర్శించి వారి రక్షణకు భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు ప్రింటర్ బహూకరణ

కోటనందూరు: స్థానిక పోలీసుస్టేషన్‌కు మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మాతిరెడ్డి భాస్కరరావు ప్రింటర్ బహూకరించారు. గురువారం స్థానిక నేతల చేతుల మీదుగా ఎస్సై రామకృష్ణకు ప్రింటర్ అందజేశారు. కార్యక్రమంలో లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, గాడి రాజబాబు, చిరంజీవిరాజు, పెనుముచ్చు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వంచన చంద్రబాబు నైజం

- వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

తొండంగి: అడ్డగోలు హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పైడికొండలో ×బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ౹ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

తొండంగి: మండలంలోని పైడికొండ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు నరిశె చంద్రరావు, నరిశె నాని, నరిశె సత్తిబాబు కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీ నేత యనమల కృష్ణుడు వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొయ్యా మురళి, మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వెస్.ఎంపీపీ నాగం గంగబాబు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్, రాష్ట్ర బూత్ కన్వీనర్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బెక్కం చంద్రగిరి, పార్టీ నాయకులు మేడిశెట్టి దారబాబు, జెక్కా వరహాలు, నర్సె ఉమాశంకర్, కాశిందేవుల శ్రీనివాస్, గుద్దటి అప్పారావు, మురాలశెట్టి సత్యనారాయణ, పేకేటి హరికృష్ణ, బూర్తి నాని పాల్గొన్నారు.



పైడికొండలో పార్టీలో కండువాలు వేసి ఆహ్వానించిన పార్టీ నేత యనమల కృష్ణుడు



పైడికొండలో బాబు మోసాలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న యనమల కృష్ణుడు, నాయకులు

చంద్రబాబు పచ్చి మోసకారి

కోటనందూరు: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబు పచ్చి మోసకారి అని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి లాలం బాబ్జీ ఆరోపించారు. మండలంలోని జగన్నాథపురం, భీమవరపుకోట, ఎస్సార్‌పేట గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల అమలులో గత జగన్ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని గణాంకాలతో సహ ప్రజలకు చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై కూటమి నేతలను నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గొర్లి రామచంద్రరావు, ఎంపీపీ లగుడు శ్రీనివాస్, సర్పంచులు జిగటాల వీరబాబు, రుత్తల రాజేశ్వరి, విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు పల్లి శ్రీను, సూరిబాబురాజు, కొత్తపల్లి మాణిక్యలరావు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో చంద్రబాబు మోసాలను మహిళకు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సమస్యలపై గరంగరం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భువనసుందరి



సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

- అధికారుల తీరుపై మండిపడిన కౌన్సిల్ సభ్యులు
- అభివృద్ధి పనులపై సమాచారం ఇవ్వడంలేదంటూ నిలదీత
- వాడీవేడిగా తుని కౌన్సిల్ సమావేశం

తుని రూరల్: తుని పట్టణంలోని సమస్యలపై కౌన్సిల్ సభ్యులు గళమెత్తారు. వివిధ వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. తుని మున్సిపల్ కౌన్సిల్ హాలులో గురువారం చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు జరిగాయి. రెండు అజెండాల్లో అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. జీరో అవర్‌లో కౌన్సిలర్లు తమ వార్డుల్లో సమస్యలను వివరించారు. పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను నిలదీశారు. రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని, తాము ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులమని కౌన్సిలర్ షేక్ ఖ్వాజా నిలదీయగా అందుకు సునీత మద్దతు పలికారు. ఒకటో వార్డులో సమాచారం ఇవ్వకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నారని కౌన్సిలర్ జ్యోతి మండిపడ్డారు. దీనిపై చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని అభివృద్ధి పనులు జరిగే ప్రాంతంలో గౌరవ సభ్యులకు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మరోసారి ఇటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు

గవరపేట పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న రోడ్డును త్వరగా నిర్మించాలని కౌన్సిలర్ శ్రీదేవి కోరారు. పశువుల ఆస్పత్రి నుంచి జ్యోతినగర్ (రామకృష్ణ కాలనీ)కి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, ఆ రోడ్డును విస్తరించాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో 101 రోడ్లు వేసేందుకు చర్యలు చేపట్టామని, ఇప్పటి వరకు 38 రోడ్లు పూర్తి చేశామని చైర్‌పర్సన్ తెలిపారు. దశలవారీగా రోడ్లను నిర్మిస్తామన్నారు. పశువుల ఆస్పత్రి నుంచి జ్యోతినగర్‌కు వెళ్లే రహదారిను పరిశీలించి, అవసరమైతే విస్తరణకు ప్రతిపాదనలు చేస్తామని చైర్‌పర్సన్ భువనసుందరి హామీ ఇచ్చారు.

వ్యర్థాలతో దుర్వాసన

మార్కెట్ యార్డు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆనుకుని ఉన్న రహదారిలో వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని, ఈ ప్రాంతంలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరచాలని కౌన్సిలర్ చింతకాయల భారతీ కోరారు. తొమ్మిదో వార్డులో కాలువలు అభివృద్ధి చేయాలని గత నెలలో లేఖ ఇచ్చినప్పటికీ అజెండాలో పెట్టలేదని వార్డు కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను సభ దృష్టికి తీసుకువచ్చారు. హిందూ శ్మశానవాటికకు రక్షణగోడ లేకపోవడంతో ఖననం చేసిన మృతదేహాలను కుక్కలు బయటకు లాగుతున్నాయన్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. మున్సిపల్ ఉద్యోగి సునీత రూ.26 లక్షలు ఆస్తి పన్నులు దుర్వినియోగం చేసే వరకు పైస్థాయి అధికారులు ఏం చేస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను డిమాండ్ చేశారు. ఈ అంశంపై పోలీసులు ఇప్పటికే నిందితురాలిని అరెస్టు చేయగా ఆమె భర్త పాస్‌పోర్టును సీజ్ చేశారని, విచారణకు అధికారిని నియమించినట్టు చైర్‌పర్సన్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ భాస్కరరావుకు సత్కారం



ఈఓపీఆర్డీ భాస్కరరావు దంపతులను సత్కరిస్తున్న, ప్రజాప్రతినిధులు, అధికారులు



తునిలో మూర్తిరాజును సత్కరిస్తున్న తహసీల్దార్, వీఆర్వోలు

జగ్గంపేట: అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని పలువురు నేతలు అన్నారు. ఈఓపీఆర్డీ మేడవరపు సూర్యభాస్కరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక శివపార్వతి కల్యాణ మండపంలో గురువారం సత్కార సభ నిర్వహించారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, స్థానిక నేత మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు ఆధ్వర్యంలో భాస్కరరావు దంపతులను పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈఓపీఆర్డీగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వీఆర్వో మూర్తిరాజుకు సత్కారం

తుని రూరల్: తుని పట్టణంలో గుర్రాలశాల వీఆర్వోగా సేవలు అందించిన నాగులపల్లి మూర్తిరాజును రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించారు. 23 సంవత్సరాలు వీఆర్వోగా విశిష్ట సేవలు అందించిన ఆయన గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయం ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. మూర్తిరాజును తహసీల్దార్ జిబిఎస్.ప్రసాద్, విఆర్వోలు, కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని ప్రార్థనలు



ఏలేశ్వరంలో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



గజ్జనపూడి రామాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యం కోరుతూ పట్టణంలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక 3వ వార్డులోని బాల్ హోమ్ చర్చిలో పార్టీ పట్టణశాఖ ఉపాధ్యక్షుడు పేకల జాన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవిందు, బత్తిన శ్రీను, పట్టా సుబ్బారావు, కొండబాబు, శేఖర్, సత్యనారాయణ, చక్రం తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని కోరుతూ గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఎస్సీపేటలోని ఆర్సీఎం చర్చిలో పాస్టర్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గజ్జనపూడి రామాలయంలో గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ సభ్యుడు అనకాపల్లి నూకరాజు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అల్లు సత్తిబాబు, పార్టీ నాయకులు గొనగాల దేవుళ్లు, బర్ల చక్రం, ఇసరపు సూర్యారావు, నీలి మాణిక్యాలరావు, గార శీను, అల్లు గంగ బాబు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగిలో వినాయక గుడి ఎదురుగా ఉన్న స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వినాయకుని గుడి ఎదురుగా గత 28 సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న పంచాయతీ స్థలాన్ని దైవ కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఈ స్థలాన్ని సమీపాన ఉన్న వ్యక్తులు కబ్జా చేస్తున్నారన్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ రాయుడు రాజబాబు, మొండి ఈశ్వరరావు, త్రిమూర్తులు, మల్లిపాముల సూరిబాబు, మద్రి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు మోక్షం

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో ముంపు సమస్యకు మోక్షం లభించింది. గ్రామంలోని డ్రైన్లలో పూడిక తీయకపోవడంతో మూసుకుపోయి పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఏచిన్న పాటి వర్షం పడినా నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. దీనిపై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి దిగువకు, గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక మూసుకుపోయిన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. అధికారులు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ఎంఈఓ వి.రాజబాబు, పంచాయతీ కార్యదర్శి బి. వీరబాబు, పోలీసులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో సమాజాభివృద్ధి

గండేపల్లి: సమాజం అభివృద్ధికి టెక్నాలజీ దోహదపడుతుందని ఆదిత్య యూనివర్సిటీ ప్రోవైస్ చాన్సలర్ ఆదిరెడ్డి రమేష్ అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గురువారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎలిమెంటరీ ఫండమెంటల్స్ ఆఫ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే అధునాతన ప్రాజెక్టును అభివృద్ధి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మైక్రో లింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ వి.గోవిందరావు, ఆర్‌వీవీ కృష్ణ, సీహెచ్ జానకిదేవి, వై.సుబ్బారావు, పి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గోకవరం: బావాజీపేట, గోకవరం ఫీడర్లలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ నటరాజన్, ఏఈ వైవీఎస్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. గోకవరం మండలంలో తంటికొండ, గాదెలపాలెం, గోపాలపురం, దేవీపట్నం మండలంలోని గరగరంపాలెం, అచ్చియ్యపాలెం, ఇటికాయలపల్లి, ఇందుకూరుపేట, ఇందుకూరు, దేవారం, పోతుకొండ, పోతారం, ఫజిల్లాబాద్, కచ్చులూరు ఆర్అండ్ఆర్ కాలనీ, ఉప్పయ్యపాలెం, శరభవరం, ఎస్.రామన్నపాలెం, గండికోట ఆర్అండ్ఆర్ కాలనీ, ఎం.రావిలంక, నాగులపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీని విజయవంతం చేయాలి

తుని: కాకినాడలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక రాజా ప్రభుత్వ హైస్కూల్లో గురువారం ప్లీనరీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగా సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ విద్యను నాశనం చేస్తుందని ఆరోపించారు. విద్యారంగంలో సమస్యలపై చర్చించే ఈ ప్లీనరీకి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రత్తిపాడు: స్థానిక అఖిల్ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి అనుబంధ సంస్థ సత్య ఐ కేర్ సిబ్బంది ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కళాశాల అధినేత ఇనకోటి గంగాధర్ ప్రారంభించారు. సుమారు 600 మంది విద్యార్థులకు ఐ కేర్ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కిసాన్ యోజనపై అవగాహన కల్పించాలి

జగ్గంపేట: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజనను శనివారం నుంచి ప్రతి రైతు సేవా కేంద్రంలో ప్రారంభించాలని, ఆయా పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయకుమార్ సూచించారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం జగ్గంపేట వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్‌లో ఖరీఫ్ పనులపై సమీక్షించారు. రైతులకు కౌలు కార్డులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ జి.శ్రీనివాస్, జగ్గంపేట, గండేపల్లి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో సిబ్బందితో సమీక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్